
# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
3-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:16
సంచిక: 132

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD


## నామినేటెడ్‌కు వేళాయె

పదవుల కోసం నిరీక్షిస్తున్న కాంగ్రెస్ జనం

నిజమైన కాంగ్రెస్ నేతలకే అవకాశం

పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు

కష్టపడ్డ కార్యకర్తలకు గుర్తింపు

ప్రతిపాదనలు పంపాలన్న టీపీసీసీ చీఫ్

2లో



## ప్రశాంత్ కిషోర్ గెలుస్తారా?

బాంకీపూర్ ఉప ఎన్నికల కౌంటింగ్ నేడే

నితిన్ నబీన్ రాజీనామాతో బై పోల్

జన సూరజ్ తరపున బరిలోకి ప్రశాంత్ కిషోర్

ప్రశాంత్ కిషోర్.. ఎన్నికల వ్యూహకర్తగా.. ఎన్నో రాజకీయ పార్టీలకు అద్భుతమైన విజయాలను అందించారు. కానీ తన స్వరాష్ట్రం బీహార్లో మాత్రం తాను ఏర్పాటు చేసిన రాజకీయ పార్టీని గెలిపించుకోలేకపోయారు. కనీసం ఉనికి చాటుకోలేకపోయారు. కానీ ఇప్పుడు బీహార్ లోని అత్యంత కీలకమైన బాంకీపూర్ శాసనసభ ఉప ఎన్నికల్లో పోటీ చేశారు. ఇప్పటికే పోలింగ్ పూర్తయింది.

**క్రైమ్ మిర్రర్, సెంట్రల్ డెస్క్ :** సోమవారం కౌంటింగ్ జరగనుంది. అయితే ఎన్నికల కమిషన్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం.. ఇక్కడ కేవలం 34.24% పోలింగ్ మాత్రమే జరిగింది.. గత సాధారణ అసెంబ్లీ ఎన్నికల్లో 41.45% పోలింగ్ జరగగా.. ఇప్పుడు ఏడు శాతానికి పడిపోయింది.

2లో



## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

### మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్

ప్రభుత్వం తరపున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ

ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క

అంగరంగ వైభవంగా జరుగుతున్న లష్కర్ బోనాల జాతర

2లో

## హైడ్రాకు ప్రజా మద్దతు!

హైడ్రా పనితీరుపై న్యాయస్థానాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. హైడ్రా వ్యవస్థ పనితీరుపై అభ్యంతరాలు వ్యక్తం అయ్యాయి. ఏకంగా హైడ్రా కమిషనర్ రంగనాథ్ ను తొలగించాలని హైకోర్టు ఆదేశించడం సంచలనంగా మారింది. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ప్రజల నుంచి హైడ్రా పనితీరుపై సంతృప్తి కనిపిస్తోంది. హైదరాబాద్ నగరంలో చెరువుల పరిరక్షణ, ఆక్రమణల తొలగింపు లక్ష్యంగా ఏర్పాటైన హైడ్రా.. చేపట్టిన సంస్కరణల సత్ఫలితాలు క్షేత్రస్థాయిలో కనిపిస్తున్నాయి. ముఖ్యంగా ఉప్పల్ నల్లచెరువు విషయంలో అక్కడి ప్రజలు హైదరాబాద్ సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అభినందనలు తెలుపుతున్నారు.

### ఉప్పల్ ప్రజలు జేజేలు

నల్లచెరువు స్వరూపమే మారడమే కారణం

కమిషనర్ రంగనాథ్ చర్యలపై అక్కడి ప్రజల్లో సంతృప్తి

ఆయన మార్పుపై పెద్ద ఎత్తున అభ్యంతరాలు



**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** ఉనికి కోల్పోయిన చెరువు.. ఒకప్పుడు దుర్గంధంతో అలమటిస్తూ, ఆక్రమణల కోరల్లో చిక్కుకుంది ఉప్పల్ నల్లచెరువు.



2లో

## తీన్మార్ మల్లన్నకు కష్టమే!

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో మరోసారి బరిలోకి

సొంత వేదిక ద్వారా పోటీ

గతంలో కాంగ్రెస్ పార్టీ అండతో విజయం

ఆ పార్టీతో ఇప్పుడు తెగదెంపులు

## బోనాలను గతంలో పట్టించుకోలేదు..

కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా: కేటీఆర్

సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్

గత ప్రభుత్వాలు బోనాలను గుర్తించలేదని విమర్శ

కేసీఆర్ పాలనలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా వచ్చిందన్న మాజీ మంత్రి

వర్షాలు బాగా పడి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడి

నేడు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2లో


## భూమికి ఆధార్ లాంటి 'భూధార్' నంబర్: మంత్రి పొంగులేటి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన ధరణి అక్రమాలపై కఠిన చర్యలు తీసుకుంటామన్న మంత్రి

భూ అక్రమ లావాదేవీలపై త్వరలో ఫాస్ట్ ట్రాక్ విచారణ జరుపుతామని వెల్లడి

ప్రతీ సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో 'భూధార్' నంబర్ కేటాయిస్తామన్న పొంగులేటి

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు నిధుల కొరత ఉండదని హామీ

# తీన్మార్ మల్లన్నకు కష్టమే!

(మొదటి పేజీ తరువాయి)

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో :** తెలంగాణలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల సందడి మొదలైంది. వచ్చే ఏడాది మార్చిలో వరంగల్ -ఖమ్మం-నల్గొండ పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పదవీ విరమణ చేయనున్నారు. దీంతో ఆ స్థానానికి ఎన్నిక జరగనుంది. మరోసారి తీన్మార్ మల్లన్న పోటీ చేసేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు. అయితే సిట్టింగ్ ఎమ్మెల్సీగా బరిలో దిగుతున్న ఆయన గెలుపు పై అనేక రకాల సందేహాలు ఉన్నాయి. పల్లా రాజేశ్వర్ రెడ్డి ఎమ్మెల్యేగా ఎన్నిక కావడంతో.. ఆ స్థానానికి బైపోల్ జరిగింది. అధికార కాంగ్రెస్ పార్టీ మద్దతుతో తీన్మార్ మల్లన్న బరిలో నిలిచి గెలిచారు. కానీ ఆయన ఆ పార్టీతో తెగ తెంపులు చేసుకున్నారు. సొంత రాజకీయం మొదలుపెట్టారు. తన సొంత వేదిక ద్వారా ఎమ్మెల్సీగా గెలవాలని చూస్తున్నారు.

**ప్రత్యేక స్థానం..**

తెలంగాణ రాజకీయాల్లో తీన్మార్ మల్లన్న ప్రత్యేక స్థానం. తన డిజిటల్ మీడియా ద్వారా ప్రభుత్వాలను, అక్రమాలను ప్రశ్నించే బలమైన గొంతుకగా మారారు. యూత్ లోను మంచి క్రేజ్ ఉండేది. నిరుద్యోగ యువత సైతం ఆయనను ఎంతగానో ఇష్టపడేవారు. గతంలో ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన సమయంలోనే లక్షల ఓట్లు సొంతం చేసుకున్నారు ఆ క్రేజ్ తోనే. అనంతరం కాంగ్రెస్ లో చేరి భారత రాష్ట్ర సమితి తో పాటు భారతీయ జనతా పార్టీని తట్టుకొని నిలబడగలిగారు. ఎమ్మెల్సీ గా గెలిచారు. కానీ మునుపటి పరిస్థితి లేదు ఇప్పుడు. ఆయన క్రేజ్ తగ్గింది.

**గతంలో మంచి పేరు..**

ఒకప్పుడు తీన్మార్ మల్లన్న అంటే ప్రభుత్వాలతో పాటు ప్రతిపక్షాలు సైతం గడగడలాడేవి. కానీ పట్టభద్రుల ఎమ్మెల్సీగా గెలిచిన తర్వాత ఆయన ఎంచుకున్న రాజకీయ దారి పునాదులను కదిలించింది. బీసీ ఐక్యత పేరుతో కొన్ని వర్గాలను ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తూనే.. ఇతర కులాలను, కొన్ని విభాగాలను తీవ్రంగా విమర్శిస్తూ చేసిన వ్యాఖ్యలు ఆయన ఇమేజ్ ను దెబ్బతీసాయి. విద్యావంతులు, పట్టభద్రులు ఓటు వేసే ఎమ్మెల్సీ నియోజకవర్గంలో కుల గణనలు, వ్యక్తిగత దూషణల కంటే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, శాసనమండలిలో వారి గళాన్ని వినిపించే వైఖరికి ప్రాధాన్యమిస్తారు. ఈ క్రమంలో మల్లన్న పాత ఇమేజ్ను పోగొట్టుకొని.. దారి తప్పిన రాజకీయ నాయకుడిగా మిగిలిపోయారని అభిప్రాయం వినిపిస్తోంది.

**విపరీతమైన పోటీ..**

ప్రస్తుతం తీన్మార్ మల్లన్నకు అన్ని రాజకీయ పార్టీలు వ్యతిరేకంగా నిలిచే ఛాన్స్ ఉంది. కాంగ్రెస్ పార్టీ సంస్థాగత బలం, ఓటు బ్యాంకు అండగా నిలిచే అవకాశం లేదు. భారత రాష్ట్ర సమితి తో పాటు భారతీయ జనతా పార్టీ సైతం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఈ ఎన్నికల ద్వారా బొట్టు నిలుపుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. సొంత వేదిక ద్వారా బరిలో దిగితే తీన్మార్ మల్లన్నకు చాలా కష్టం. అందుకే తన పాదయాత్రల ద్వారా మళ్లీ జనంలోకి వెళ్లి కోల్పోయిన నమ్మకాన్ని పునరుద్ధరించుకోవాలన్న ప్రయత్నంలో ఉన్నారు మల్లన్న. అయితే ఇంత చేసిన తర్వాత కూడా కనీస ఓట్లు తెచ్చుకోకపోతే మాత్రం తీన్మార్ మల్లన్న మనుగడకే కష్టం. చూడాలి మరి ఏం జరుగుతుందో.



# లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

(మొదటి పేజీ తరువాయి)

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# నామినేటెడ్‌కు వేళాయె




తెలంగాణలో కాంగ్రెస్ నాయకులు సుదీర్ఘకాలంగా ఎదురుచూస్తున్ననామినేటెడ్ పోస్టులు, ఇతర కీలక పదవుల భర్తీ త్వరలోనే జరగనుంది. ఇందుకు సంబంధించిన ప్రక్రియ తుది దశకు చేరుకుంది. అన్ని స్థాయుల్లో ఖాళీగా ఉన్న నామినేటెడ్ పదవుల భర్తీ కోసం అర్హులైన, క్రమశిక్షణ కలిగిన పార్టీ కార్యకర్తల పేర్లతో కూడిన ప్రతిపాదనలను వారం రోజుల్లోగా సమర్పించాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ అన్ని జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులకు సూచించారు. ఈ పదవుల ఎంపిక, వర్గీకరణకు సంబంధించి ఇటీవల ఢిల్లీలో సమగ్రంగా చర్చించినట్లు తెలిపారు. అధికారంలోకి రావడం కోసం క్షేత్రస్థాయిలో చెమటోడ్చిన నిజమైన కాంగ్రెస్ సైనికులకు తగిన గుర్తింపు ఇవ్వడమే లక్ష్యంగా ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం అడుగులు వేస్తోందన్నారు. నామినేటెడ్ పదవులకు ఎంపిక ప్రక్రియలో విప్లవాత్మక మార్పులు తెస్తూ కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయం తీసుకుంది. గతంలో కాంగ్రెస్ మండల, జిల్లా కార్యవర్గాల్లో, అనుబంధ సంఘాలలో చురుగ్గా పనిచేసి పార్టీ బలోపేతానికి, ఆందోళన కార్యక్రమాలకు ముందుండి నడిపిన వారికి, అలాగే నియోజకవర్గ స్థాయి సీనియర్ నాయకులకు ఏకంగా 60 శాతం నామినేటెడ్ పోస్టులను కేటాయించాలని విధానపరమైన నిర్ణయం తీసుకున్నారు. ఎలాంటి రాజకీయ, నాయకుల సిఫారసులు లేకుండా.. కేవలం పార్టీకి అందించిన సేవలు, కష్టపడే తత్వాన్నే ప్రామాణికంగా తీసుకుని నేరుగా అర్హులకు అవకాశం కల్పిస్తామని మహేశ్‌కుమార్‌గౌడ్ హామీ ఇచ్చారు. ఈ ప్రక్రియకు అవసరమైన విధివిధానాలు ఖరారు చేసేందుకు ఈ నెల 1న హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. పీసీసీ అధ్యక్షుడితో పాటు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొని వివిధ అంశాలపై లోతుగా చర్చించారు. భవిష్యత్తులో రాబోయే ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘాల (పీఏసీఎస్) డైరెక్టర్లు, ఛైర్‌పర్సన్లు, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి నామినేటెడ్ పోస్టులకు నిజమైన నిబద్ధత గల పార్టీ కార్యకర్తలను గుర్తించే బాధ్యతను జిల్లా ఇన్‌ఛార్జి మంత్రులకు అప్పగించారు.

**ఇన్ చార్జి మంత్రులదే బాధ్యత**

ఉమ్మడి జిల్లాలకు ఉన్న ఇన్‌ఛార్జి మంత్రి.. ఆయా జిల్లాల్లోని స్థానిక మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, డీసీసీ అధ్యక్షులు, గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, సీనియర్ నాయకులతో ప్రత్యేకంగా సమావేశం కానున్నారు. క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా ఆశావహుల వివరాలతో కూడిన సమగ్ర నివేదికను రూపొందిస్తారు. జిల్లాల నుంచి అందే నివేదికల ఆధారంగా తుది జాబితాను సిద్ధం చేసిన అనంతరం, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో స్వయంగా చర్చించి పదవుల ప్రకటనను అధికారికంగా ఖరారు చేయనున్నారు.

# హైడ్రాకు ప్రజా మద్దతు!



(మొదటి పేజీ తరువాయి)

ఆ పరివాహక ప్రాంతంలో భవన నిర్మాణ వ్యర్థాలు వేయడం, ప్లాస్టిక్స్ చెత్తతో నింపేయడం.. చెరువు తన అస్తిత్వాన్ని కోల్పోయింది. వర్షం వస్తే చాలు పరిసర కాలనీలు, ప్రధాన రహదారులు జలమయం అయ్యేవి. దీనిపై దృష్టి పెట్టింది హైడ్రా. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ తో కలిసి సమగ్ర కార్యాచరణను చేపట్టింది. చెరువు పరిధిలోని అక్రమ నిర్మాణాలను తొలగించడమే కాకుండా.. టన్నుల కొద్దీ పూడిక, చెత్తాచెదారాన్ని స్వల్పకాలంలోనే తొలగించి చెరువు నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచింది.

**ఇప్పుడు పర్యాటక ప్రాంతంగా..**

ప్రస్తుతం ఉప్పల్ నల్లచెరువు ప్రాంతం పర్యాటక ప్రాంతంగా మారింది. చెరువులోని మురుగునీరు చేరకుండా డైవర్షన్ ఛానళ్లను ఏర్పాటు చేశారు. చెరువు కట్టను బలపరిచి దాని చుట్టూ వాకింగ్ ట్రాక్, విద్యుత్తు దీపాలు, సందర్శకుల కోసం సుందరమైన బెంచీలు, పచ్చదనంతో కూడిన ల్యాండ్ స్కేటింగ్ తీర్చిదిద్దారు. సాయంత్రం వేళల్లో వృద్ధులు, చిన్నారులు, మహిళలు ప్రశాంతంగా గడుపుతున్నారు. ఉప్పల్ ప్రాంతానికి వాకింగ్ అండ్ రీ క్రియేషన్ స్టార్ట్ గా మారింది.

**మంచి ఇమేజ్..**

ఉప్పల్ ప్రాంతంలో హైడ్రాతో పాటు కమిషనర్ రంగనాథ్ కు మంచి ఇమేజ్ ఉంది. న్యాయస్థానం ఆయన మార్పునకు ఆదేశాలు ఇవ్వడంతో ఈ ప్రాంతీయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. హైడ్రా వచ్చిన తర్వాత ఆక్రమణదారుల్లో గుండెల్లో రైళ్లు పరిగెత్తిన విషయాన్ని ఎక్కువ మంది గుర్తు చేస్తున్నారు. హైడ్రా అనేది కేవలం కూల్చివేతలకు మాత్రమే పరిమితం కాకుండా.. చెరువుల పునరుద్ధరణ.. ప్రజారోగ్యం పరిరక్షణ.. కాలుష్యం నియంత్రణ వంటి వాటికి ఎక్కువ దోహద పడిందని చాలామంది అభిప్రాయపడుతున్నారు. హైడ్రాతో పాటు కమిషనర్ రంగనాథ్ కు మద్దతు తెలుపుతున్నారు.

# ప్రశాంత్ కిషోర్ గెలుస్తారా?

**ఉప ఎన్నిక అనివార్యం.:**



ఈ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా నితిన్ నబీన్ ప్రాతినిధ్యం వహించేవారు. కానీ ఆయన బిజెపి జాతీయ అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకున్నారు. ఆపై రాజ్యసభకు ఎన్నికయ్యారు. దీంతో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. అదే నియోజకవర్గానికి ఇప్పుడు ఉప ఎన్నిక అనివార్యంగా మారింది. బిజెపికి బలమైన కోటగా ఉన్న ఈ స్థానంలో ప్రశాంత్ కిషోర్ తన జన సూరజ్ పార్టీ తరఫున బరిలో దిగడంతో.. ఇక్కడ ఎన్నిక ఆసక్తికరంగా మారింది. గురువారం పోలింగ్ రోజున తమ పార్టీ ఏజెంట్లను మద్దతుదారులను పోలీసులు అక్రమంగా అదుపులోకి తీసుకుంటున్నారని.. బిజెపికి కొమ్ముకాస్తున్నారని ప్రశాంత్ కిషోర్ ఆందోళనకు దిగారు. మరోవైపు ప్రశాంత్ కిషోర్ బయట వ్యక్తులను తీసుకొచ్చి బోగస్ ఓట్లు వేయించేందుకు ప్రయత్నించారని బిజెపి ఎదురుదాడికి దిగింది.

**పోలింగ్ శాతం తక్కువ..**

అయితే ఎన్నికల్లో పోలింగ్ శాతం తక్కువ నమోదు కావడంతో ఏ పార్టీకి ప్లస్ అవుతుందనే దానిపై తీవ్ర చర్చ నడుస్తోంది. సాంప్రదాయకంగా అర్బన్ ఓటర్లు, వర్తక వర్గాలు ఎక్కువగా ఉంటారు ఈ నియోజకవర్గంలో. 1995 నుంచి ఇక్కడ బిజెపి పాగా వేసింది. ఆ పార్టీకి గట్టి పట్టు ఉంది. ఇక్కడ భారతీయ జనతా పార్టీ తరఫున యువనేత నీరజ్ కుమార్ సిన్హా బరిలో దిగారు. అయితే బిజెపి ఓటింగ్ యధాతథంగా పడిందా? ప్రశాంత్ కిషోర్ ప్రభావం ఉందా? అనేది తెలియాల్సి ఉంది. మరోవైపు ఆర్ జెడి అభ్యర్థి రేఖ గుప్తా గట్టి పోటీ ఇచ్చినట్లు కనిపిస్తోంది. కానీ మేధావి వర్గం తనకు మద్దతు ఇస్తుందని ప్రశాంత్ కిషోర్ ఆశలు పెట్టుకున్నారు. అందుకే సోమవారం ఎన్నికల ఫలితాలపై అందరి దృష్టిపడింది. ఉదయం 11 గంటల్లోపు ఫలితం రానుంది. ఒకవేళ ప్రశాంత్ కిషోర్ గెలుపు సాధిస్తే మాత్రం భవిష్యత్తులో బీహార్ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసే అవకాశం ఉంది. ఒకవేళ విజయం అంచుల దాకా వచ్చినా.. వచ్చే ఎన్నికల నాటికి బలమైన శక్తిగా మారే అవకాశం ఉంది. అదే బిజెపి భారీ విజయం సాధిస్తే మాత్రం ప్రశాంత్ కిషోర్ కు అక్కడ ఇబ్బందికరమే.

# బోనాలను గతంలో పట్టించుకోలేదు..

(మొదటి పేజీ తరువాయి)

దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ.25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

# భూమికి ఆధార్ లాంటి 'భూధార్' నంబర్: మంత్రి పొంగులేటి




గత ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్ వేదికగా జరిగిన భూ అక్రమాలపై ఉక్కుపాదం మోపుతామని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి హెచ్చరించారు. పేదల భూములను అక్రమంగా చేజిక్కించుకున్న వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఈ అక్రమాలపై త్వరలోనే ఫాస్ట్ ట్రాక్ విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గతంలోని ధరణి వ్యవస్థ నుంచి ప్రస్తుత 'భూ భారతి' వరకు జరిగిన ప్రతి లావాదేవీని క్షుణ్ణంగా పరిశీలిస్తామని మంత్రి వివరించారు. తమ ప్రభుత్వం కొత్తగా ఒక్క అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితా (ప్రొహిబిటెడ్ లిస్ట్)లో చేర్చలేదని, గత ప్రభుత్వ హయాంలో రూపొందించిన జాబితాపై ప్రస్తుతం సమగ్ర సమీక్ష నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 276 గ్రామాల్లో భూముల రీ-సర్వే ప్రక్రియ పూర్తయిందని వెల్లడించారు. భవిష్యత్తులో ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో విశిష్ట 'భూధార్' నంబర్‌ను కేటాయించనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. అసైన్డ్ భూముల సమస్యల శాశ్వత పరిష్కారానికి త్వరలోనే స్పష్టమైన, సమగ్రమైన విధానాన్ని తీసుకువస్తామని పొంగులేటి హామీ ఇచ్చారు. అదే సమయంలో ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో ప్రభుత్వం ఏమాత్రం రాజీపడబోదని తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం నుంచి నిధుల విడుదల ఆలస్యమైనప్పటికీ, ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు క్రమం తప్పకుండా చెల్లింపులు జరుపుతామని ఆయన భరోసా ఇచ్చారు. భూముల విలువ సవరణ అనంతరం రిజిస్ట్రేషన్ల ద్వారా వచ్చే ఆదాయం 10 నుంచి 20 శాతం మేర పెరిగిందని మంత్రి తెలిపారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా సుమారు రూ.18 వేల కోట్ల ఆదాయం సమకూరుతుందని అంచనా వేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

క్రైమ్ మిర్రర్
తెలంగాణ
సోమవారం
3-8-2026





# అవినీతికి అడ్డాగా

# సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్

## చేతులు తడపనిదే రిజిస్ట్రేషన్ చేయమంటున్న సిబ్బంది

**జీవో నెంబర్ 131 కు తూట్లు ...**

**ఎల్ ఆర్ ఎస్ లో క్రమబద్ధీకరించని ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేయడం విడ్డూరం**

**ఒకటి కాదు... రెండు కాదు లెక్కకు మించిన ప్లాట్లను సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్ట్రేషన్ చేసినట్లుగా ఆరోపణలు**

**ఉన్నతాధికారులకు ఫిర్యాదు అయినా చర్యలు శూన్యం**

**సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది అవినీతికి ఉన్నతాధికారులు కూడా వంత పాడుతున్నారా?!**

(క్రైమ్ మిర్రర్ నిఘా ప్రతినిధి ):

సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ఏ పని జరగాలన్న సిబ్బంది చేతులు తడపాల్సిందేనన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం పూర్తిగా అవినీతికి అడ్డాగా మారిందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నప్పటికీ, ఉన్నతాధికారులు చూసి చూడనట్లు వ్యవహరించడం పలు అనుమానాలకు తావునిస్తోంది.

సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందితో ఉన్నతాధికారులు లాలూచీపడి అవినీతిని ప్రోత్సహిస్తున్నారా? అన్న అనుమానాలు లేకపోలేదు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 131 ప్రకారం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీం కింద క్రమబద్ధీకరించిన ప్లాట్లను మాత్రమే రిజిస్ట్రేషన్ చేయాల్సి ఉండగా, సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అందుకు భిన్నంగా ఎల్ ఆర్ ఎస్ లో క్రమబద్ధీకరించని ప్లాట్లను కూడా రిజిస్ట్రేషన్ చేయడం వెనుక ఆంతర్యం ఏమిటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇలా ఒకటి కాదు రెండు కాదు... లెక్కకు మించిన ప్లాట్లు ఇటీవల కాలంలో సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అధికారులు రిజిస్ట్రేషన్ చేసినట్లు తెలుస్తోంది. నిబంధనలకు భిన్నంగా ఎలా రిజిస్ట్రేషన్ చేశారన్న ప్రశ్నలకు అధికారుల వద్ద నుంచి సమాధానం కరువయ్యింది. స్థానికంగా ఉండే డ్యాక్యుమెంట్ రైటర్లు,సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బంది మిలాఖత్ అయిపోయి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతూ, తమ సొంత జేబులో నింపుకుంటున్నారన్న ఆరోపణలు సర్వత్రా వినిపిస్తున్నాయి. సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ సిబ్బందిపై పెద్ద ఎత్తున అవినీతి ఆరోపణలతో కూడిన ఫిర్యాదులను పలువురు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ, శాఖ పరంగా ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం అనుమానాలకు తావునిస్తోంది. ఉన్నతాధికారులే కార్యాలయ సిబ్బంది అవినీతిని ప్రోత్సహిస్తున్నారా? అనే చర్చ సైతం స్థానికంగా జరుగుతోంది. సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కు తెలిసే ఈ తతంగమంతా జరుగుతోందా?, ఇందులో ఆమె ప్రమేయం లేకపోతే అవినీతిని అరికట్టేందుకు చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో 131 జీవో కు తూట్లు పొడుస్తూ, ఎల్ ఆర్ ఎస్ లో క్రమబద్ధీకరించని ప్లాట్ల ను కూడా రిజిస్ట్రేషన్ చేసిన సర్వే నెంబర్లతో కూడిన సమగ్ర వార్తా కథనాన్ని రేపటి సంచికలో ప్రచురించనున్నాం...దీనికి సరూర్ నగర్ సబ్ రిజిస్ట్రార్ ఏమీ సమాధానం చెబుతారో?!

**సమగ్ర వార్త కథనం పూర్తి ఆధారాలతో రేపటి సంచికలో..**

**నిఘా వ్యవస్థ నిద్రిస్తే.. క్రైమ్ మిర్రర్ కాపు కాస్తుంది..**

## విశాఖపట్నం నుంచి హైదరాబాద్‌కు ఊపిరితిత్తుల తరలింపు

గ్రీన్ ఛానల్‌తో వేగవంతమైన రవాణా



**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రాణాలను కాపాడే అవయవ మార్పిడి ప్రక్రియలో మరో కీలక ఘట్టం చోటుచేసుకుంది. విశాఖపట్నం నుంచి సేకరించిన సజీవ అవయవమైన ఊపిరితిత్తులను (లంగ్స్) ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు తరలించారు. ఇందుకోసం సంబంధిత అధికారులు సమన్వయంతో గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి అవయవాన్ని అత్యంత వేగంగా గమ్యస్థానానికి చేర్చారు. ఇండిగో విమానంలో రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ), శంషాబాద్‌కు చేరుకున్న అనంతరం, పోలీసులు ప్రత్యేక గ్రీన్ ఛానల్‌ను ఏర్పాటు చేశారు. దీంతో విమానాశ్రయం నుంచి సికింద్రాబాద్‌లోని మినిస్టర్ రోడ్డులో ఉన్న కిమ్స్ ఆసుపత్రి వరకు ట్రాఫిక్ అంతరాయం లేకుండా అంబులెన్స్‌కు మార్గం కల్పించారు. ఈ అవయవాన్నిటిజి09యు0642 నంబర్ గల ప్రత్యేక అంబులెన్స్‌లో కిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గ్రీన్ ఛానల్ కారణంగా విలువైన సమయం ఆదా కావడంతో అవయవం సురక్షితంగా ఆసుపత్రికి చేరుకుంది. అవయవ మార్పిడి వంటి అత్యవసర సేవల్లో పోలీసులు, విమానాశ్రయ అధికారులు, వైద్య బృందాలు సమన్వయంతో పనిచేస్తూ ప్రతి నిమిషాన్ని ప్రాణరక్షణకు వినియోగించడం మరోసారి స్పష్టమైంది. ఈ గ్రీన్ ఛానల్ విజయవంతంగా అమలు కావడంతో అవయవ మార్పిడి కోసం ఎదురుచూస్తున్న రోగికి సకాలంలో చికిత్స అందే అవకాశాలు మెరుగుపడ్డాయి.

## భావిక్ అగర్వాల్ జన్మదినం సందర్భంగా పేద చిన్నారులకు అల్పాహార పంపిణీ





క్రైమ్ మిర్రర్, ఎల్బీనగర్ , ఆగస్టు 2: కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు చెందిన భావిక్ అగర్వాల్ జన్మదినాన్ని పురస్కరించుకుని ఆదివారం పేద చిన్నారుల హాస్టల్‌లో అల్పాహార సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సుమారు 300 మంది చిన్నారులకు రుచికరమైన అల్పాహారాన్ని అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి భావిక్ అగర్వాల్‌కు జన్మదిన శు భాకాంక్షలు తెలియజేశారు. చిన్నారులు ఆనందంగా కార్యక్రమంలో పాల్గొని సేవా కార్యక్రమాన్ని అభినందించారు. కార్యక్రమంలో కృష్ణ గోపాల్ సేవా సమితి అధ్యక్షులు డాక్టర్ కపిల్ కుమార్ అగర్వాల్‌తో పాటు సమితి అధికారులు, సభ్యులు పాల్గొని చిన్నారులకు సేవలందించారు. ఈ సందర్భంగా భావిక్ అగర్వాల్‌కు హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ, కృష్ణ గోపాల్ సేవా సమితి ద్వారా అన్నదానం, అల్పాహార పంపిణీతో పాటు వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆసక్తి ఉన్న దాతలు, సేవాభావం కలిగిన వారు మా సేవా సమితి ని సంప్రదించాలని కోరారు.

GHMC
hmda Growing Global
TS-bPASS
MAKAM GANGADHAR NETHA
President (GHMC)
Telangana Building Planners Association
E-mail ID : sriswamiplanners@gmail.com



SRI SWAMI ASSOCIATES
ARCHITECTS•ENGINEERS•SURVEYORS
We Undertake Building Plans, Lay-Out Plans & Permissons, LRS, BRS, Tax Assesments
GHMC, HMDA, DTCP, TS-bpass, Layout, Building Permissions
వాస్తుకి బిల్డింగ్ ప్లానింగ్, నక్ష చేయబడును
డిజిటల్ లాండ్స్ సర్వే, లే-అవుట్లు,
నక్ష ప్లానింగ్ చేయబడును,
Auto DCR Online Up Loading, Pre DCR Cad Drawing
భవన నిర్మాణం దరఖాస్తు కొరకు సంప్రదించండి.
H.No. 11-5-565, Bhagya Laxmi Towers,
Opp: GHMC Circle Office,
Saroornagar, Hyderabad - 500035
Mob : 9393929595

# ఏదులాపురంలో సిపిఐ(ఎం) పార్టీలోకి పలు కుటుంబాలు చేరిక

## ప్రజా సమస్యల పరిష్కారానికి ఐకమత్యంగా కదలాలి - బండి రమేష్

## ప్రతి నిత్యం మీకు అందుబాటులో ఉంటా - ఊరడి హైమావతి సుదర్శన్ రెడ్డి




**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో::** ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 31 వ వార్డులో ఏర్పాటు చేసిన జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ ఏదులాపురంలో ఎక్కడ ఉంది సిపిఎం పార్టీ అని అవహేళనగా మాట్లాడిన వారికి మేమున్నాం అంటూ అత్యధిక మెజారిటీతో ఊరడి హైమావతి సుదర్శన్ రెడ్డిని గెలిపించి ఇక్కడి ప్రజలు ధీటైన జవాబు ఇచ్చారని కొనియాడారు. ప్రజా సమస్యలపై నిత్యం పోరాడే నాయకుడు, మంచి మనిషి ఊరడి సుదర్శన్ రెడ్డి సేవలతో పాటు, ప్రజలు కూడా అవసరమైన సమయంలో ప్రజా సమస్యల పరిష్కారానికై దేశ రాజధాని ఢిల్లీలో జరిగిన పోరాట స్ఫూర్తితో ఐకమత్యంగా ముందుకు రావాలని తెలిపారు. ఏదులాపురం మున్సిపాలిటీ కార్యదర్శి ఊరడి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ ఏదులాపురం ప్రజలకు ఎల్లప్పుడూ తోడుగా ఉంటానని , ప్రజల కష్టాలే తన కష్టాలుగా భావించి అన్ని విధాలుగా వారికి సాయం చేస్తూనే ఉంటాను అన్నారు.అత్యధిక మెజారిటీతో గెలిపించిన 31వ వార్డు ప్రజలకు, కార్యకర్తలకు , నాయకులకు సానుభూతిపరులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా ఊరడి సుదర్శన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులు, పార్టీ సిద్ధాంతాలు నచ్చిన వివిధ కుటుంబాలకు చెందిన ప్రజలు స్వచ్ఛందంగా సిపిఎం పార్టీలో చేరారు. పాలేరు డివిజన్ కార్యదర్శి బండి రమేష్ ఆధ్వర్యంలో ఏపూరి గోపి, బంక కృష్ణ, బంక మధు, ఏపూరి చిన్న గోపి, నారపాటి నాగరాజు,గుండేటి ప్రియాంక, గుండేటి జయమ్మ,టేకుమట్ల కళావతి లకు పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో 31వ వార్డు కౌన్సిలర్ ఊరడి హైమావతి,జిల్లా నాయకులు బషీరుద్దీన్, రూరల్ మండల కార్యదర్శి వడ్లమూడి నాగేశ్వరావు,ప్రజా నాట్యమండలి పాలేరు డివిజన్ కార్యదర్శి నందిగామ కృష్ణ , మండల నాయకులు దుండిగల నాగయ్య, వెంకటేశ్వర్లు, పొన్నేకంటి అనీష్, డి.వై.ఎఫ్.ఐ నాయకులు గడ్డం సిద్ధూ, యూత్ కమిటీ సహాయక కార్యదర్శి బొడ్డు వెంకటేష్, పవన్ రెడ్డి, ఉదయ్, సీఐటీయూసీ నాయకలు దిగుట్ల ఉపేందర్, పొన్నేకంటి చక్రవర్తి, బల్లి ఉదయ్ పొన్నేకంటి విజయ్, పొన్నేకంటి వంశీ , తదితరులు పాల్గొన్నారు.

# బైపాస్‌పై బీభత్సం..

## కంటైనర్ ఢీకొని మహిళ మృతి

**స్కూటీపై వెళ్తున్న దంపతులకు ప్రమాదం.. భర్తకు తీవ్ర గాయాలు**

**ప్రమాదం తర్వాత కంటైనర్ డ్రైవర్ పరారీ**

**ఫ్లైఓవర్లు నిర్మించాలని గ్రామస్తుల డిమాండ్**


**మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి**



మిర్యాలగూడ క్రైమ్ మిర్రర్ , ఆగస్టు 2 : మిర్యాలగూడ పట్టణంలోని రవీంద్రనగర్ బైపాస్ వద్ద ఆదివారం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న దంపతుల్లో భార్య అక్కడికక్కడే మృతి చెందగా, భర్త తీవ్రంగా గాయపడ్డాడు. ప్రమాదానికి కారణమైన కంటైనర్ వాహనం డ్రైవర్ వాహనాన్ని ఆపకుండా పరారయ్యాడు.పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. వాటర్ ట్యాంక్ తండాకు చెందిన ధనావత్ సేవ్యా తన భార్య కమిలి (40)తో కలిసి స్కూటీపై మిర్యాలగూడ వైపు వస్తున్నారు. రవీంద్రనగర్ బైపాస్ వద్ద అద్దంకి--నార్కట్‌పల్లి రహదారిని దాటుతుండగా, నల్గొండ నుంచి వాడపల్లి వైపు వెళ్తున్న కంటైనర్ వెనుక నుంచి వేగంగా వచ్చి స్కూటీని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో స్కూటీ వెనుక కూర్చున్న కమల తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందగా, సేవ్యాకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ఆయనను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం అనంతరం కంటైనర్ డ్రైవర్ పరారయ్యాడు.మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్లు నాగభూషణరావు, సోమనర్సయ్య తెలిపారు.ప్రమాద సమాచారం అందుకున్న మృతురాలి బంధువులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో ఘటనాస్థలికి చేరుకుని ఆందోళన చేపట్టారు. బైపాస్ జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ప్రమాదాల నివారణకు వెంటనే ఫ్లైఓవర్ల నిర్మాణం చేపట్టాలని, మృతురాలి కుటుంబానికి తగిన నష్టపరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రమాద విషయం తెలుసుకున్న స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బీఎల్ఆర్) ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రభుత్వపరంగా అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

# చేనేత కళాకారుల కూలి రేట్లు వెంటనే పెంచాలి

**మాస్టర్ వీవర్స్ అసోసియేషన్‌కు చేనేత కార్మిక సంఘం వినతిపత్రం**



**క్రైమ్ మిర్రర్ చందూరు,జులై 2;** కరోనా సమయంలో తగ్గించిన చేనేత కార్మికుల కూలి రేట్లను వెంటనే పునరుద్ధరించి పెంచాలని చేనేత కార్మిక సంఘం డిమాండ్ చేసింది. ఈ మేరకు మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జూలూరు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు గంజి యాదగిరికి సంఘం నాయకులు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ, 2019లో కరోనా మహమ్మారి కారణంగా మాస్టర్ వీవర్ల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని చేనేత కార్మికులు తమ కూలీలలో కోతను అంగీకరించారని తెలిపారు. అయితే కరోనా సంక్షోభం ముగిసి ఐదేళ్లు గడిచినా, నిత్యావసర వస్తువుల ధరలు, జీవన వ్యయం భారీగా పెరిగినప్పటికీ తగ్గించిన కూలీలను ఇప్పటి వరకు పెంచకపోవడం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.రాత్రింబవళ్లు శ్రమించి నాణ్యమైన వస్త్రాలను తయారు చేస్తున్న చేనేత కళాకారులు పెరుగుతున్న ద్రవ్యోల్బణంతో కుటుంబాలను పోషించుకోవడం కష్టంగా మారిందన్నారు. కళాకారుల శ్రమను గుర్తించి ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా కూలి రేట్లను పెంచాలని మాస్టర్ వీవర్స్ అసోసియేషన్‌ను కోరారు.చేనేత కార్మికుల న్యాయమైన డిమాండ్లపై అసోసియేషన్ సానుకూల నిర్ణయం తీసుకుని తక్షణమే కూలి రేట్లను సవరించాలని, లేనిపక్షంలో కార్మికుల సంక్షేమం కోసం ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు రాపోలు వెంకటేశం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తిరందాసు శ్రీనివాసులు, జూలూరు వెంకటేశం, బొల్ల జనార్ధన్, వర్కాల విజయ్ కుమార్, కర్నాటి శ్రీనివాసులు, గుర్రం రాము, చెరుపల్లి రాఘవేంద్ర, పద్మ పవన్ కుమార్, జూలూరు మల్లేష్, కలిమికొండ యాదయ్యతో పాటు పెద్ద సంఖ్యలో చేనేత కార్మికులు పాల్గొన్నారు.

# మణికొండ ప్రభుత్వ భూమిపై మళ్లీ ఆక్రమణల కలకలం

## రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికుల డిమాండ్



**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** మణికొండ జాగీర్ సర్వే నంబరు 42లోని విలువైన ప్రభుత్వ భూమిపై మరోసారి ఆక్రమణలు జరుగుతున్నాయంటూ స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల రెవెన్యూ అధికారులు ఆక్రమణలను తొలగించి ప్రభుత్వ భూమిగా బోర్డు ఏర్పాటు చేసినప్పటికీ, శాశ్వత రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చిందని వారు ఆరోపిస్తున్నారు. స్థానికుల కథనం ప్రకారం, ఆక్రమణలు తొలగించిన అనంతరం భూమి చుట్టూ కంచె ఏర్పాటు చేయకుండా కేవలం హెచ్చరిక బోర్డు మాత్రమే ఏర్పాటు చేశారు. దీంతో ప్రభుత్వ భూమిని మరోసారి కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొంటున్నారు. ప్రభుత్వ బోర్డును సైతం పక్కకు జరిపి ఆక్రమణలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి రక్షణ విషయంలో సంబంధిత శాఖల నిర్లక్ష్యం కారణంగానే ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు విమర్శిస్తున్నారు. ఆక్రమణలు పునరావృతం కాకుండా శాశ్వత చర్యలు చేపట్టడంలో అధికారులు విఫలమయ్యారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.




**చర్యలు తీసుకోవాలి...**

ప్రభుత్వ భూమి చుట్టూ వెంటనే పటిష్టమైన కంచె ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ కోసం భద్రతా చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఆక్రమణలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కూడా శాఖాపరమైన చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు.

**అధికారులు జోక్యం చేసుకోవాలి..**

ఇప్పటికైనా ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని మణికొండ సర్వే నంబరు 42లోని ప్రభుత్వ భూమిని పూర్తిస్థాయిలో రక్షించే చర్యలు చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజలతో కలిసి పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని స్థానికులు హెచ్చరించారు.



# అంగరంగ వైభవంగా మంకాలమ్మ బోనాల పండుగ

**ఊరేగింపులో అలరించిన పోతురాజుల విన్యాసాలు**

**మహేశ్వరం ప్రతినిధి (క్రైమ్ మిర్రర్):** మహేశ్వరం మండల పరిధిలో ఉన్న పలు గ్రామాలలో మంకాలమ్మ బోనాల పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. ఉదయము 4 గంటలకు అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక అలంకరణ చేసి సుప్రభాత సేవతో పూజల ప్రారంభించారు.ఆలయానికి రంగురంగు పువ్వులతో అలంకరించారు ఉదయం 10 గంటలనుండి గ్రామ ప్రజలు అమ్మవారికి బోనాలు సమర్పించారు సాయంత్రం 5 గంటలకు అమ్మవారికి ఘటాల ఊరేగింపు చేశారు ఊరేగింపులో పోతరాజుల విన్యాసాలు భక్తులను అలరింపజేశాయి గ్రామ పెద్దలు యువకులు,ఊరేగింపులో ఉత్సాహంగా పాల్గొన్నారు.

# మట్టి కుండలోంచి 'వాము (కుమ్మరుల బతుకు చిత్రాలు)' పుస్తక ఆవిష్కరణ

**కుమ్మరుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే విలువైన గ్రంథం -- వక్తలకు శుభాకాంక్షలు తెలిపిన దరిపల్లి ప్రవీణ్ కుమార్**

భువనగిరి, ఆగస్టు 02 : డాక్టర్ అట్టెం దత్తయ్య సంపాదకత్వంలో, ధ్రువ ఫౌండేషన్ అందిస్తున్న "తెలంగాణ బీసీ కథలు" శ్రేణిలో రెండవ గ్రంథంగా వెలువడిన "వాము (కుమ్మరుల బతుకు చిత్రాలు)" పుస్తకాన్ని ఆదివారం భువనగిరిలోని శ్రీ దరిపల్లి అనంత రాములు ఆడిటోరియం, కృషి ఐటిఐ క్యాంపస్‌లో ఘనంగా ఆవిష్కరించారు. కుమ్మరుల సంప్రదాయ వృత్తికి ప్రతీకగా మట్టి కుండలో దాచిన పుస్తకాన్ని ఆవిష్కర్త ఆచార్య రవిశంకర్, ప్రభుత్వ ఈఎన్‌టీ హాస్పిటల్, కోటి, హైదరాబాద్ ఆవిష్కరించగా సభికుల కరతాళ ధ్వనుల మధ్య కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ప్రముఖ కవి, రచయిత అన్నవరం దేవేందర్ సభాధ్యక్షత వహించారు. ముఖ్య అతిథి ఆచార్య పి.సి. వెంకటేశ్వర్లు, సంచాలకులు, ప్రాచ్య పరిశోధనా సంస్థ, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, తిరుపతి మాట్లాడుతూ, "వృత్తి ఆధారిత సమాజాల చరిత్రను సాహిత్య రూపంలో భద్రపరచడం సమాజానికి ఎంతో అవసరం. 'వాము' వంటి గ్రంథాలు భావితరాలకు చారిత్రక ఆధారాలుగా నిలుస్తాయి" అని అన్నారు. విశిష్ట అతిథి ఆచార్య వై. వెంకటేశ్వర్లు, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ మాట్లాడుతూ, "కుమ్మరుల జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు, వారి వృత్తి వైభవాన్ని ఈ గ్రంథం చక్కగా ఆవిష్కరించింది. ఇది పరిశోధకులు, విద్యార్థులు, సాహిత్యాభిమానులకు ఉపయోగపడే విలువైన పుస్తకం" అని పేర్కొన్నారు. విశిష్ట అతిథి దరిపల్లి ప్రవీణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం (౧=ఖా), యాదాద్రి భువనగిరి జిల్లా మాట్లాడుతూ, "కుమ్మరుల కళా వైభవాన్ని, శ్రమజీవుల జీవన గాథలను, వారి ఆత్మగౌరవాన్ని ఈ పుస్తకం ప్రతిబింబిస్తుంది. ప్రతి కుమ్మర కుటుంబంలో ఈ గ్రంథం ఉండాలి. సమాజ చరిత్రను సంరక్షించడంలో ఇటువంటి రచనలు ఎంతో ఉపయోగపడతాయి" అని అన్నారు. ఆత్మీయ అతిథి డాక్టర్ దరిపల్లి కిరణ్ కుమార్, ప్రిన్సిపాల్, దరిపల్లి అనంత రాములు ఇంజనీరింగ్ కళాశాల, ఖమ్మం మాట్లాడుతూ, "సంప్రదాయ వృత్తులను భావితరాలకు పరిచయం చేయడంలో 'వాము' గ్రంథం ఒక గొప్ప ప్రయత్నం. యువత తమ మూలాలను తెలుసుకోవడానికి ఈ పుస్తకం దోహదపడుతుంది" అని అన్నారు.ఆత్మీయ అతిథి ఎదునూరి మల్లేశం, రైతు సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ, "గ్రామీణ జీవనంలో కుమ్మరుల సేవలు చిరస్మరణీయం. అలాంటి వృత్తిదారుల జీవితాలను పుస్తక రూపంలో నిలపడం అభినందనీయం" అన్నారు. డాక్టర్ వాసరవేణి పరుశురాములు, తెలుగు ప్రభుత్వ అధ్యాపకులు, పుస్తక సమీక్షకులుగా మాట్లాడుతూ, ""వాము'లోని కథలు కుమ్మరుల జీవన వాస్తవాలను హృదయాన్ని హత్తుకునేలా చిత్రించాయి.

# మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఘనంగా బోనాల వేడుకలు

### అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి .. ప్రజలకు బోనాల శుభాకాంక్షలు





**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. బాబుల్‌రెడ్డి నగర్, పల్లె చెరువు, లక్ష్మీగూడా, శాంతినగర్ ప్రాంతాల్లో వెలసిన అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి వివిధ ఆలయాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సిరిసంపదలు, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భక్తులను పలకరించిన తోకల శ్రీనివాస్ రెడ్డి బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆలయాల వద్ద భక్తుల రద్దీ నెలకొంది. మహిళలు సంప్రదాయ బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించగా, డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు అడికే జనార్ధన్, రమేష్ రెడ్డి, మన్మోహన్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రావుల భాస్కర్, శ్రీనివాస్, శ్రీకాంత్ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువత మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు.

# బోనాల పండుగ జాతరోచ్చారో సాంగ్ పోస్టర్ ఆవిష్కరణ

### మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్.. నిర్మత గొడుగు బలవర్ధన్

**వనపర్తి ఆగస్టు 2 క్రైమ్ మిర్రర్:** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపల్ కేంద్రంలోని నేటి లీడర్ మ్యూజిక్ ఛానల్ ఆధ్వర్యంలో రూపొందిన బోనాల పండుగ జాతరోచ్చారో జానపద గీతం పోస్టర్‌ను ఆదివారం సాయంత్రం ఘనంగా ఆవిష్కరించారు. ఇటీవల శ్రీ గంగమ్మ దేవాలయం మరియు శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయాల్లో చిన్నారుల నృత్యాలతో ఈ జానపద గీతం చిత్రీకరణను విజయవంతంగా పూర్తి చేశారు. అనంతరం ఆదివారం సాయంత్రం 6 గంటలకు శ్రీ చౌడేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన తర్వాత, ముఖ్య అతిథులుగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ మరియు స్థానిక ఎస్సై వెంకటేశ్వర్ గౌడ్ చేతుల మీదుగా సాంగ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గీతాన్ని టీవీలో వీక్షించిన అతిథులు, కొరియోగ్రాఫర్ నవీన్, గేయ రచయిత, నిర్మాత గొడుగు బాలవర్ధన్, అలాగే సాంగ్ నిర్మాణంలో భాగమైన టీమ్ సభ్యులను శాలువాలతో సన్మానించి అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, స్థానిక సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించే జానపద గేయాలను మరింత సృజనాత్మకంగా రూపొందిస్తూ, ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. కళాకారుల ప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని మంచి సృజనాత్మక



కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వేమారెడ్డి,దయాకర్ రెడ్డి, బుజ్జి,అస్కని ఆనంద్,మేకల.కర్రెస్వామి, ఎల్లయ్య,రాములు యాదవ్, సర్వరెడ్డి, రణధీర్, గ్రామ పెద్దలు, భక్తులు, కళాకారులు, ప్రజాప్రతినిధులు మరియు పలువురు స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.


## క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు కంటెంట్ రైటర్లు కావలెను

### సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.

స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.

క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.

సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.

తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.

సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.

న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.

ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.

9393929595


# ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారికి శాకాంబరి అవతార అలంకరణ

### మణికొండ శ్రీ బీరప్ప మల్లన్న దేవాలయంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు




**గండిపేట(క్రైం మిర్రర్):** ఆషాఢ మాసం పురస్కరించుకుని మణికొండ 127వ డివిజన్‌లోని శ్రీ బీరప్ప మల్లన్న దేవాలయ ప్రాంగణంలో శ్రీ రేణుక ఎల్లమ్మ అమ్మవారిని శాకాంబరి అవతారంలో అద్భుతంగా అలంకరించి ప్రత్యేక పూజలు, ఆరాధనలు ఘనంగా నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, పుష్పాలతో అమ్మవారిని సర్వాంగ సుందరంగా అలంకరించడంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో వేదమంత్రోచ్చారణల మధ్య జరిగిన కార్యక్రమంలో భక్తులు అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ వేడుకలో ఆలయ కమిటీ చైర్మన్ బి. జైహింద్ రావు, కురుమ సంఘం అధ్యక్షుడు సి. బీరప్ప, ప్రధాన కార్యదర్శి ఈ. వెంకటేష్, కోశాధికారి ఎన్. గణేష్, కమిటీ సభ్యులు బి. ముత్యాలు, బి. శ్రీరాములు (పెద్ద), ఈ. యాదయ్య, డి. బాబు, బి. శంకర్, డి. కృష్ణ, డి. లక్ష్మణ్, బి. ఆంజనేయులు, కె. రమేష్, డి. కిట్టు, యాదమ్మ, జంగమ్మ, ఆలయ ప్రధాన పూజారి నాగబాబు శర్మతో పాటు పలువురు భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం అమ్మవారికి మహా మంగళహారతి నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తిశ్రద్ధలతో నిర్వహించిన ఈ శాకాంబరి అలంకరణ మహోత్సవం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.



# శంషాబాద్ డివిజన్‌లో ఘనంగా బోనాల వేడుకలు

### అమ్మవారిని దర్శించుకున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోకల శ్రీనివాస్ రెడ్డి

**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని జీహెచ్ఎంసీ శంషాబాద్ డివిజన్‌లో బోనాల పండుగ వేడుకలు భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించబడ్డాయి. సిద్ధాంతి, కాపుగడ్డ, ఆర్‌బీ నగర్, మధురనగర్ ప్రాంతాల్లో వెలసిన శ్రీ అమ్మవారి దేవాలయాల్లో ప్రత్యేక పూజలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు వైభవంగా సాగాయి. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యులు తోకల శ్రీనివాస్ రెడ్డి, జిల్లా అధ్యక్షులు పంతగి రాజ్ భూపాల్ గౌడ్తో కలిసి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యం, సమృద్ధి కలగాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి భక్తులను పలకరించిన వారు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ నెలకొనగా, మహిళలు సంప్రదాయ బోనాలతో అమ్మవారికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలు, భక్తుల జైజై ధ్వానాలతో ఆలయ ప్రాంగణాలు ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడాయి. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, యువకులు మరియు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

# బుల్లెట్ రైలు భూ బాధితుల సమావేశంలో ఉద్రిక్తత

### సమావేశాన్ని అడ్డుకున్నారంటూ పోలీసుల తీరుపై రైతుల ఆగ్రహం




**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** రంగారెడ్డి జిల్లాలో బుల్లెట్ రైలు ప్రాజెక్టు భూ బాధితుల సమావేశం ఆదివారం ఉద్రిక్తంగా మారింది. శంషాబాద్ మండల్ పరిధిలోని బహదూర్గుడ గ్రామంలో కోర్టు తీర్పు అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకు భూ బాధితులు, రైతులు శాంతియుతంగా సమావేశం నిర్వహిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారని బాధితులు ఆరోపించారు. భూ బాధితుల కథనం ప్రకారం కోర్టు తీర్పును గౌరవిస్తూ తదుపరి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించేందుకు మాత్రమే సమావేశమైనప్పటికీ, పోలీసులు అక్కడికి చేరుకుని సమావేశాన్ని కొనసాగించవద్దని హెచ్చరించినట్లు తెలిపారు. అక్కడ ఎలాంటి సమావేశం లేదా నిరసన చేపట్టరాదని సూచిస్తూ, సమావేశాన్ని విరమించుకోవాలని ఒత్తిడి తెచ్చినట్లు పేర్కొన్నారు. అంతేకాకుండా సమావేశం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫలకాలు, బ్యానర్లు, ఇతర సామగ్రిని తొలగించారని, అక్కడ ఉన్న రైతులను భయభ్రాంతులకు గురిచేస్తూ నిరసన కొనసాగిస్తే పోలీస్ స్టేషన్‌కు తరలిస్తామని హెచ్చరించినట్లు భూ బాధితులు ఆరోపించారు. దీంతో సమావేశం వద్ద కొంతసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. తాము ఎలాంటి శాంతిభద్రతలకు భంగం కలిగించలేదని, కోర్టు తీర్పు అనంతరం భవిష్యత్ కార్యాచరణపై చర్చించేందుకే సమావేశమైనామని, అయినప్పటికీ తమను అడ్డుకోవడం బాధాకరమని భూ బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రశాంతంగా జరుగుతున్న సమావేశాన్ని భగ్నం చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని వారు పేర్కొన్నారు. పోలీసుల వ్యవహారశైలిపై స్థానిక రైతులు, భూ బాధితులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, తమ సమస్య పరిష్కారం కోసం చట్టబద్ధంగానే పోరాటాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.



# మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యం

గండిపేట(క్రైం మిర్రర్): మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన సంఘటన చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బృందావన్ కాలనీకి చెందిన రాకేష్‌కుమార్(29) గత నెల 29వ తేదీన మధ్యాహ్నం సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రైనా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురై ఫోన్‌కు కాల్ చేయగా స్విచ్ ఆఫ్ అని వచ్చింది. దీంతో చుట్టు పక్కల ప్రాంతాలు, బంధువులు, స్నేహితుల వద్ద వాకాబు చేసిన ఎలాంటి ఆచూకీ లభించలేదు. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ఉప్పరపల్లిలో ఘనంగా ఆషాఢ మాస బోనాల నిర్వహణకు సన్నాహాలు

## సామ భూపాల్ రెడ్డి అధ్యక్షతన గ్రామ ముఖ్య నాయకుల సమావేశం

### ఆగస్టు 9న మాంకాలమ్మ బోనాలు, ఆగస్టు 10న పోచమ్మ బోనాలు





**గండిపేట(క్రైం మిర్రర్):** ప్రతి ఏటా ఆషాఢ మాసంలో లష్కర్ బోనాల అనంతరం ఆనవాయితీగా వచ్చే ఉప్పరపల్లి బోనాల పండుగను ఈ సంవత్సరం కూడా ఎంతో వైభవంగా, ఐక్యమత్యంతో నిర్వహించేందుకు ఏర్పాట్లు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఉప్పరపల్లి గ్రామానికి చెందిన ముఖ్య నాయకులు సమావేశమై బోనాల ఏర్పాట్లపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సమావేశానికి సామ భూపాల్ రెడ్డి అధ్యక్షత వహించారు.ఈ సందర్భంగా గ్రామ నాయకులు మాట్లాడుతూ ఆషాఢ మాసంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, చెట్లు చిగురించి, పంటలు బాగా పండాలని అలాగే గ్రామ ప్రజలకు ఎలాంటి రోగాలు, జబ్బులు రాకుండా పోచమ్మ తల్లి చల్లగా చూడాలని కోరుకుంటూ బోనాలు సమర్పించడం మన ఉప్పరపల్లి ఆనవాయితీ. ఊరి ప్రజలందరం కలిసికట్టుగా, భక్తిశ్రద్ధలతో ఈ ఆషాఢ మాస బోనాలను జరుపుకుంటాం అని తెలిపారు. ఆగస్టు 9 మాంకాలమ్మ బోనాలు. ఆగస్టు 10 పోచమ్మ బోనాలు గ్రామ ప్రజలందరూ విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని తెలిపారుఈ సమావేశంలో సామ భూపాల్ రెడ్డి , జయరాం, బొక్క బాల్ రెడ్డి, కృష్ణ గౌడ్, మోహన్ రెడ్డి, విట్టల్, పుస్తకాల నర్సింగ్ రావు, నరసింహా రెడ్డి, పుస్తకాల శ్రీనివాస్, శివకుమార్ రెడ్డి, సంజీవ రెడ్డి, రాం రెడ్డి, మల్లారెడ్డి, భూపాల్ రెడ్డి, కిషన్ రావు, కృష్ణ గౌడ్ (కిట్టు), బుచ్చి రెడ్డి, విజయ్ పాల్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, సదానందం, సురేష్ గౌడ్, బొక్క ప్రభాకర్ రెడ్డి, నరసింహా రెడ్డి, వెంకట్ రెడ్డి, ప్రసాద్ గౌడ్, కీర్తి ప్రదీప్, జైపాల్ రెడ్డి, పుస్తకాల మహేష్, రాజేష్, మదం రెడ్డి పాల్గొన్నారు.



## మణికొండ నల్లపోచమ్మ అమ్మవారికి వడిబియ్యం సమర్పించిన నార్సింగి మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ

### ఆషాఢ మాస బోనాల సందర్భంగా భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు

**గండిపేట(క్రైం మిర్రర్):** ఆషాఢ మాస బోనాల ఉత్సవాలు నగర వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్న వేళ, మణికొండలోని శ్రీ నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ లక్ష్మీశ్రీ అమ్మవారికి సంప్రదాయబద్ధంగా వడిబియ్యం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. అనంతరం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలు సుఖశాంతులతో ఉండాలని, మంచి వర్షాలు కురిసి రైతులు, ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రార్థించారు. ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని ఆశీస్సులు పొందారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు శైలజ, వందన, బిందు, కొల్ల కుమార్ తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం జైమాతాదీ నినాదాలు, మంగళవాయిద్యాలు, భక్తుల రద్దీతో కళకళలాడింది. బోనాల సందర్భంగా నిర్వహించిన ఈ ప్రత్యేక పూజలు భక్తి, సంప్రదాయాల సమ్మేళనంగా సాగగా, అమ్మవారి కృపతో ప్రతి ఇంటా ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం, సుభిక్షం నెలకొనాలని భక్తులు ఆకాంక్షించారు.

## పల్లె చెరువు కట్ట మైసమ్మ ఆలయం పరిసరాల్లో బురద సమస్యకు తాత్కాలిక పరిష్కారం

### ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చిప్స్, డస్ట్ వేయించిన కాంగ్రెస్ నాయకుడు టీ ప్రేమ్ గౌడ్



**గండిపేట(క్రైం మిర్రర్):** మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని పల్లె చెరువు కట్టపై ఉన్న మైసమ్మ దేవాలయం పరిసరాలు ఇటీవల వర్షాల కారణంగా పూర్తిగా బురదమయంగా మారాయి. దీంతో ఆలయానికి వచ్చే భక్తులు, స్థానిక ప్రజలు రాకపోకల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు టీ. ప్రేమ్ గౌడ్ వెంటనే స్పందించి, ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ఆలయం పరిసర ప్రాంతంలో చిప్స్, డస్ట్ వేయించి తాత్కాలికంగా బురద సమస్యను నివారించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా టీ. ప్రేమ్ గౌడ్ మాట్లాడుతూ ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు ఎప్పుడూ ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ముఖ్యంగా ఆలయాలకు వచ్చే భక్తులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. శాశ్వత పరిష్కారం కోసం సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేలా కృషి చేస్తామని వెల్లడించారు. స్థానికులు టీ. ప్రేమ్ గౌడ్ చేపట్టిన చర్యలను అభినందిస్తూ, బురద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని అధికారులను కోరారు.

## ఎస్ఐఆర్ ఫార్మ్‌ను బీఎల్ఓలకు అందజేసిన నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్



**గండిపేట(క్రైం మిర్రర్):** ఓటరు జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నార్సింగి వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎర్పుల కుమార్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆయన మణికొండలో తన ఎస్ఐఆర్ ఫార్మ్‌ను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఏర్పుల కుమార్ ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో అత్యంత విలువైనదని పేర్కొన్నారు. ఎస్ఐఆర్ ఫార్మ్ అందుకున్న ప్రతి ఓటరు వాటిని నిర్లక్ష్యం చేయకుండా, సరైన వివరాలతో పూర్తిగా నింపి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు సంబంధిత బూత్ లెవల్ అధికారులకు (బీఎల్ఓలు) తప్పనిసరిగా సమర్పించాలని సూచించారు. ఓటరు జాబితా పారదర్శకంగా, తప్పులు లేకుండా ఉండేందుకు ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన కోరారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా సహకరించాలని, ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయడంలో ఈ కార్యక్రమం కీలకమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు కాసాని పుల్లారావు, సురేష్ గౌడ్, సంబంధిత బీఎల్ఓలు, స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సినారె సాహిత్య స్ఫూర్తికి ఘన నివాళి

### నామాల రవీంద్రసూరి కి సినారె సాహిత్య పురస్కారం--2026



**కూకట్ పల్లి, ఆగస్ట్ 02 (క్రైమ్ మిర్రర్):** పద్మభూషణ్, జ్ఞానపీఠ పురస్కార గ్రహీత మహాకవి డా. సి. నారాయణరెడ్డి 95వ జయంతి సందర్భంగా హైదరాబాద్‌లోని తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన సినారె సాహిత్య పురస్కారం--2026 వేడుకలు సాహిత్య వైభవాన్ని ప్రతిబింబించాయి. ప్రముఖ కవులు, రచయితలు, కళాకారులు, సినీ ప్రముఖులు, సాహిత్యాభిమానుల తో కళకళలాడిన ఈ సభలో సినారె సాహిత్య వారసత్వాన్ని ఘనంగా స్మరించుకున్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ సాహిత్య అకాడమీ అధ్యక్షులు డా. నందిని సిధారెడ్డి అధ్యక్షత వహించగా, ప్రముఖ రచయిత, నటుడు తనికెళ్ల భరణి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సినారెతో తనకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ, తెలుగు సాహిత్యానికి ఆయన అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. భావుకత, భాషా సౌందర్యం, మానవీయ విలువల సమ్మేళనంగా సినారె రచనలు తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 11 మంది ప్రతిభావంతులైన కవులకు "సినారె సాహిత్య పురస్కారం--2026" ప్రదానం చేశారు. వారిలో కవి, రచయిత, సినీ దర్శకుడు నామాల రవీంద్రసూరి పురస్కారం అందుకోవడం విశేషంగా నిలిచింది.పురస్కారం స్వీకరించిన అనంతరం నామాల రవీంద్రసూరి మాట్లాడుతూ సినారెతో తనకు ఏర్పడిన సాహిత్య అనుబంధం జీవితాంతం మరువలేనిదని పేర్కొన్నారు. ఆయన సాహిత్య ఆలోచనలు, ప్రోత్సాహం తన రచనా ప్రయాణానికి బలమైన పునాదిగా నిలిచాయని అన్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం తనపై మరింత బాధ్యతను పెంచిందని, భవిష్యత్తులో సమాజానికి ఉపయోగపడే విలువైన సాహిత్యాన్ని అందించేందుకు మరింత అంకితభావంతో కృషి చేస్తానని తెలిపారు. అదేవిధంగా తనను ఈ పురస్కారానికి ఎంపిక చేసిన సమన్వయకర్త పోరెడ్డి రంగయ్య, కార్యక్రమ నిర్వాహకులు రాములు, జ్యూరీ సభ్యులు, నిర్వాహక కమిటీతో పాటు తనను ప్రోత్సహించిన ప్రతి ఒక్కరికీ ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. సినారె సాహిత్య స్ఫూర్తిని నేటి తరానికి చేరవేసే లక్ష్యంతో నిర్వహించిన ఈ సభ ఆద్యంతం సాహిత్యాభిమానులను అలరించింది. ప్రముఖుల ప్రసంగాలు, సినారె సాహిత్య విశిష్టతపై జరిగిన చర్చలు, పురస్కార ప్రదానోత్సవం కార్యక్రమానికి మరింత గౌరవాన్ని తీసుకువచ్చాయి. సాహిత్యానికి అంకితమైన మహాకవి సినారె జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలబెట్టే వేదికగా ఈ కార్యక్రమం నిలిచిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.



## మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సహకారంతో 2,50,000 ఎల్ఓసిని అందజేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి

**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 02(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబశీ ఎండి ఉమర్ ఫరూఖ్ కూతురు చిన్నారి నబీల ఫైర్దౌస్ మెదడులో రక్తం గడ్డకట్టడంతో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి ద్వారా తెలుసుకున్న మునుగోడు శాసనసభ్యులు కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి తక్షణసాహంగా 2,50,000 రూపాయలు ఎల్ఓసిని సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి చేతుల మీదుగా వారి కుటుంబ సభ్యులకు ఆదివారం నారాయణపురం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కోన్ రెడ్డి నర్సింహ, గ్రామ శాఖ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బద్దుల మురళి యాదవ్, ప్రధాన కార్యదర్శి చిలివేరు రమేష్, సహాయ కార్యదర్శి రేవనపల్లి గోపాల్, 13వ వార్డు సభ్యుడు మందుగుల బాలకృష్ణ, మాజీ వార్డ్ నెంబర్లు ఉప్పరగొని యాదయ్య, ఎండి ముస్తఫా ఖాన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాచకొండ రమేష్ బాబు, మారగోని శంకర్ గౌడ్, దుర్గం వెంకటేష్, యాస లింగారెడ్డి, ఎండి అడ్డు , అజుముద్దీన్, వజిత్, సోహెల్ తదితరులు పాల్గొన్నారు



## శంషాబాద్‌లో ఘనంగా బోనాల వేడుకలు

### అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



**గండిపేట(క్రైం మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర విశిష్ట పండుగ అయిన ఆషాడ బోనాల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం శంషాబాద్ సర్కిల్ పరిధిలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శంషాబాద్ సర్కిల్ పరిధిలోని పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించారు. ఉదయం వివిధ దేవాలయాలకు విచ్చేసిన ఆయన అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## పండుగల వేళ రౌడీ షీటర్లపై పోలీసుల ఉక్కుపాదం

### పీడీ చట్టం కింద చర్యలకు హెచ్చరిక



**గండిపేట(క్రైం మిర్రర్):** బోనాలు, వినాయక చవితి పండుగల నేపథ్యంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అప్రమత్తమయ్యారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీ షీటర్లకు ఆదివారం ప్రత్యేక కౌన్సెలింగ్ నిర్వహించి కఠిన హెచ్చరికలు జారీ చేశారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు. రౌడీ షీటర్లను ఒక్కొక్కరిని అప్రమత్తం చేస్తూ, పండుగల సమయంలో ఎలాంటి నేర కార్యకలాపాలకు పాల్పడినా సహించబోమని స్పష్టం చేశారు. శాంతి భద్రతలకు భంగం కలిగించడం, దౌర్జన్యాలు, బెదిరింపులు, గొడవలు, అక్రమ వసూళ్లు, గుంపులుగా తిరుగుతూ ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడితే వెంటనే కేసులు నమోదు చేసి చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అదేవిధంగా రౌడీ షీటర్ల కదలికలపై ప్రత్యేక నిఘా కొనసాగుతోందని, వారి ప్రతి కార్యకలాపాన్ని పోలీసులు పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. ఎలాంటి ఫిర్యాదు అందినా వెంటనే స్పందించి అవసరమైతే పీడీ చట్టం కింద కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడబోమని స్పష్టం చేశారు. పండుగల సందర్భంగా ప్రశాంత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రత్యేక బందోబస్తు, నిఘా చర్యలను మరింత కట్టుదిట్టం చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రజలు నిర్భయంగా పండుగలను జరుపుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ఎలాంటి అనుమానాస్పద కదలికలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని విజ్ఞప్తి చేశారు.

# రాజేంద్రనగర్ బుద్వేల్‌లో చిట్టీల పేరుతో భారీ మోసం..

## రూ.5 కోట్లతో దంపతులు పరారు..

### బాధితుల ధర్నా.. పోలీసుల దర్యాప్తు కోరుతూ ఆందోళన





**గండిపేట(క్రైం మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని బుద్వేల్ ప్రాంతంలో చిట్టీల పేరుతో భారీ ఆర్థిక మోసం జరిగినట్లు ఆరోపణలు వెలుగులోకి రావడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. సుమారు రూ.5 కోట్ల మేర ప్రజల నుంచి డబ్బులు వసూలు చేసి ఓ దంపతులు పరారైనట్లు బాధితులు ఆరోపిస్తున్నారు. తమ జీవితకాల పొదుపులను నమ్మకంతో చిట్టీల్లో పెట్టుబడిగా పెట్టామని, ఇప్పుడు ఆ డబ్బు తిరిగి దక్కక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బాధితుల కథనం ప్రకారం బుద్వేల్‌కు చెందిన అశోక్ అనే వ్యక్తి గత కొంతకాలంగా చిట్టీల వ్యాపారం నిర్వహిస్తూ స్థానిక ప్రజల విశ్వాసాన్ని సంపాదించాడు. ప్రారంభంలో చిట్టీలను సక్రమంగా నిర్వహిస్తూ, సమయానికి చెల్లింపులు చేయడంతో పలువురు అతనిపై నమ్మకం పెంచుకున్నారు. దీంతో ఉద్యోగులు, వ్యాపారులు, మహిళా సంఘాల సభ్యులు, మధ్యతరగతి కుటుంబాలు, పదవీ విరమణ పొందిన వ్యక్తులు సహా అనేక మంది లక్షల రూపాయలను చిట్టీల్లో పెట్టుబడిగా పెట్టినట్లు తెలుస్తోంది. అయితే ఇటీవల అకస్మాత్తుగా అశోక్ కుటుంబ సభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి కనిపించకుండా పోవడంతో బాధితుల్లో ఆందోళన నెలకొంది. పలుమార్లు ఫోన్ చేసినా స్పందన లేకపోవడంతో మోసపోయామని గ్రహించిన బాధితులు పెద్ద సంఖ్యలో బుద్వేల్‌లోని అతని నివాసానికి చేరుకున్నారు. ఇంటికి తాళం వేసి ఉండటంతో ఆగ్రహానికి గురైన వారు అక్కడే ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ సుమారు రూ.5 కోట్ల వరకు ప్రజల నుంచి డబ్బులు సేకరించి దంపతులు పరారయ్యారని ఆరోపించారు. కొందరు బాధితులు లక్షల రూపాయలు అప్పు చేసి చిట్టీల్లో పెట్టామని, ఇప్పుడు అప్పులు తీర్చలేని పరిస్థితి ఏర్పడిందని కన్నీటి పర్యంతమయ్యారు. మరికొందరు తమ పిల్లల చదువులు, వివాహాలు, వైద్య అవసరాల కోసం దాచుకున్న సొమ్ము మొత్తం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంలో కోర్టు నుంచి సంబంధిత వారికి ఐపీ నోటీసులు జారీ అయినట్లు కూడా బాధితులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి నిజానిజాలు వెలుగులోకి తీసుకురావాలని వారు కోరుతున్నారు. ధర్నాలో పాల్గొన్న బాధితులు మాట్లాడుతూ మా కష్టార్జిత ధనాన్ని తిరిగి ఇప్పించాలి. ఈ మోసానికి బాధ్యులైన వారిని వెంటనే గుర్తించి అరెస్టు చేయాలి. వారి ఆస్తులను స్వాధీనం చేసుకుని బాధితులకు న్యాయం చేయాలి" అని ప్రభుత్వాన్ని, పోలీసులను వేడుకున్నారు. ఈ ఘటన స్థానికంగా సంచలనం సృష్టించడంతో పలువురు ప్రజలు కూడా అక్కడికి చేరుకుని బాధితులకు మద్దతు తెలిపారు. చిట్టీల పేరుతో ప్రజలను మోసం చేసే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు సమాచారం. చిట్టీల పేరుతో వసూలు చేసిన నిధుల వివరాలు, బాధితుల సంఖ్య, ఆర్థిక లావాదేవీలపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి వాస్తవాలను వెలికితీసే దిశగా అధికారులు చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

## అపరిశుభ్రంగా ఫ్రైమ్స్ తయారీ, మైలార్ దేవ్ పల్లి జెఎస్ఆర్ ప్రొడక్ట్స్ పై దాడి

### నిషేధిత రంగులు, నేలపై ఆరబెట్టడం గుర్తింపు

### పరీక్షలకు నమూనాలు పంపిన అధికారులు





**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** నిషేధిత రంగులు వాడుతూ, అత్యంత అపరిశుభ్ర పరిస్థితుల్లో ఫ్రైమ్స్ తయారు చేస్తున్న మైలార్ దేవ్ పల్లిలోని జెఎస్ఆర్ ప్రొడక్ట్స్ యూనిట్ పై హెచ్.ఎఫ్.ఎ.ఎస్.టి పోలీసులు, ఆహార భద్రత అధికారులు దాడి చేశారు. హెచ్.ఎఫ్.ఎ.ఎస్.టి ఎస్.ఐ వి.శంకర్ ఆధ్వర్యంలో హెచ్.ఎఫ్.ఎ.ఎస్.టి బృందం, జిహెచ్ఎంసి సర్కిల్ నెం. 20 ఆహార భద్రత అధికారి కె.సౌమ్య రెడ్డి మంగళవారం బాబుల్ రెడ్డి నగర్ లోని జెఎస్ఆర్ ప్రొడక్ట్స్ ను తనిఖీ చేశారు. తనిఖీలో యూనిట్ అనుమానిత నిషేధిత సింథటిక్ ఆహార రంగులతో ఫ్రైమ్స్ తయారు చేస్తున్నట్లు గుర్తించారు. ఫ్రైమ్స్, డ్రై ఆనియన్ రింగ్స్ ను నేరుగా నేలపై ఆరబెడుతున్నారు. ప్రాంగణంలో గుట్కా ఉమ్మి మరకలు, అనుకూలం కాని తయారీ ప్లాట్ ఫామ్ లు ఉన్నాయి. ఆహార పదార్థాలు నిర్వహిస్తున్న సిబ్బంది రక్షణ పరికరాలు ధరించలేదు. ఇప్పటికే వాడిన ఫార్మా కార్టన్ లలో ప్యాక్ చేస్తున్నారు. నీటి పరీక్ష నివేదిక, ప్రయోగశాల నివేదిక, పురుగు నియంత్రణ, వైద్య ఆరోగ్య ధ్రువీకరణ పత్రాల వంటి తప్పనిసరి రికార్డులను నిర్వహించడం లేదు. ఫ్రైమ్స్ నమూనాలను ప్రయోగశాల పరీక్షలకు పంపారు. నివేదికల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని ఆహార భద్రత అధికారి తెలిపారు. ఈ కేసును ఆహార భద్రత శాఖకు అప్పగించారు. ప్రజారోగ్యానికి హానికరంగా ఆహార పదార్థాలు తయారు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని అధికారులు హెచ్చరించారు.



## శంషాబాద్లో ఘనంగా బోనాల మహోత్సవాలు, అమ్మవారికి ప్రత్యేక పూజలు

### బిఆర్ఎస్ నాయకులు పాల్గొని ప్రజలకు శుభాకాంక్షలు

### వివాద కాలనీలో భక్తిశ్రద్ధలతో వేడుకలు



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్) :** జిహెచ్ఎంసి శంషాబాద్ 118, 119 డివిజన్ పరిధిలోని వివాద కాలనీలో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనాల మహోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్ ఛార్జ్ పి.కార్తీక్ రెడ్డి మరియు బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పి.కార్తీక్ రెడ్డి మాట్లాడుతూ, అమ్మవారి కటాక్షం ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రతి ఇంటిలో సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం వెల్లివిరియాలని ఆకాంక్షిస్తూ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉందని చెప్పారు. రాష్ట్రంలో శాంతి, సుభిక్షత కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భజనలు, డప్పు చప్పుళ్లతో వాతావరణం భక్తిమయంగా మారింది.

## మైలార్ దేవ్ పల్లి లో ఘనంగా బోనాల వేడుకలు

### పలు అమ్మవార్లను దర్శించుకున్న ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

### రాష్ట్ర ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక ప్రార్థనలు

### భక్తులతో కలిసి పూజల్లో పాల్గొన్న నియోజకవర్గ ఎమ్మెల్యే





**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** తెలంగాణ రాష్ట్ర విశిష్ట పండుగ అయిన ఆషాఢ బోనాల సందర్భంగా రాజేంద్రనగర్ నియోజకవర్గం, మైలర్ దేవ్ పల్లి పరిధిలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ పవిత్ర దినాన్ని పురస్కరించుకుని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మైలార్ దేవ్ పల్లి పరిధిలోని పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించారు. వివిధ దేవాలయాలకు విచ్చేసిన ఆయన, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తన మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు వేద మంత్రాలతో పూజలు నిర్వహించగా, ఎమ్మెల్యే భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పండుగను ప్రతి ఒక్కరూ భక్తి భావంతో జరుపుకోవాలని కోరారు. పండుగ సందర్భంగా ప్రభుత్వం భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తోందని చెప్పారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో ఎమ్మెల్యే తో పాటు సరికొండ వెంకటేష్ , రాము గౌడ్, మైలార్ దేవ్ పల్లి డివిజన్ అధ్యక్షులు టి. ప్రేమ్ గౌడ్, కల్లెం లక్ష్మారెడ్డి, అనిల్, కోట పవన్ కుమార్ నేత, బోనకుర్తి రాము నేత, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు మరియు పెద్ద ఎత్తున భక్తులు, మహిళలు పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు.

## శివరాంపల్లిలో గోదాంలో అగ్నిప్రమాదం, ప్రాణనష్టం లేదు

### అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంగా మంటలు అదుపు

### అత్తాపూర్ పోలీసుల సత్వర చర్యలు



**గండిపేట్,(క్రైమ్ మిర్రర్):** అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శివరాంపల్లి వీకర్ సెక్షన్ ప్రాంతంలోని ఓ గోదాంలో ఆదివారం సాయంత్రం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం గానీ, గాయాలు గానీ జరగకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఆదివారం సాయంత్రం సుమారు 4 గంటల 36 నిమిషాలకు శివరాంపల్లి వీకర్ సెక్షన్ ప్రాంతంలో అగ్నిప్రమాదం జరిగినట్లు డయల్ 100 కు సమాచారం అంది. వెంటనే అత్తాపూర్ పోలీస్ స్టేషన్ కు చెందిన పి.వి.2 సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అగ్నిమాపక శాఖకు వెంటనే సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైర్ ఇంజిన్లతో ఘటనాస్థలికి చేరుకున్నారు. అధికారుల ఆదేశాలతో సిబ్బంది శరవేగంగా చర్యలు చేపట్టి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. గోదాంలోని వస్తువులు పాక్షికంగా దగ్ధమైనట్లు సమాచారం. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు విచారణ చేపట్టారు. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఉండవచ్చని ప్రాథమికంగా అనుమానిస్తున్నారు.

## సైబరాబాద్ లో డ్రంక్ అండ్ డ్రైవ్..

### 333 మందిపై కేసులు.....



**సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ :** వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్‌లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు 333 మందిపై కేసులు నమోదు చేశారు.

వీరిలో 269 ద్విచక్ర వాహనదారులు, 51 కార్ల డ్రైవర్లు, 11 ఆటోలు, 2 హెవీ వాహనాలు ఉన్నాయి. అత్యధికంగా 262 మంది 36ఎస్త్ర నుంచి 200ఎస్త్ర తో పట్టుబడ్డారు.మద్యం తాగి డ్రైవింగ్ చేసి ప్రమాదానికి కారణమైతే బీఎన్ఎస్ సెక్షన్ 105 కింద 10 ఏళ్ల వరకు జైలు శిక్ష విధిస్తామని పోలీసులు హెచ్చరించారు.

## డయల్-100 ఫిర్యాదు నిర్లక్ష్యం..

### రాయదుర్గం హెడ్ కానిస్టేబుల్ సస్పెండ్....

### అత్యవసర కాల్‌ను పట్టించుకోలేదు.. సైబరాబాద్ సిపి చేతిలో సస్పెన్షన్ వేటు...

### "కాలర్ వల్ల ఇబ్బంది" అని కేసు క్లోజ్ చేసిన హెచ్‌సి.. వెంటనే సస్పెండ్....

సైబరాబాద్ క్రైమ్ మిర్రర్ : అత్యవసర డయల్-100 ఫిర్యాదును పట్టించుకోకుండా విధుల్లో నిర్లక్ష్యం వహించిన రాయదుర్గం పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ సయ్యద్ యూనస్ (హెచ్.సి-661)ను సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డా. యం. రమేష్ సస్పెండ్ చేశారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 1 అర్ధరాత్రి గచ్చిబౌలి ఐకియా సమీపంలో రెండు కార్లు ఢీకొన్న ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో బాధితుడు పోలీసు సహాయం కోసం డయల్-100కు రెండుసార్లు ఫోన్ చేశాడు.ఇన్‌చార్జిగా విధుల్లో ఉన్న హెచ్.సి సయ్యద్ యూనస్ సంఘటనా స్థలానికి వెళ్లకుండా "కాలర్ వల్ల ఇబ్బంది" అంటూ రెండు ఫిర్యాదులను మూసివేశారు. ఈ విషయం సైబరాబాద్ సిపి దృష్టికి రావడంతో ఆయన తక్షణమే సయ్యద్ యూనస్‌పై సస్పెన్షన్ వేటు వేశారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగుతుందని సిపి ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.ప్రజా సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తప్పవని సైబరాబాద్ కమిషనరేట్ స్పష్టం చేసింది.

# వేడుకకు చిరునామా ఆల్ఫా: ఆలియా భట్



"'ఆల్ఫా' పరంగా నాకు బాగా నచ్చిన విషయం ఈ మూవీ స్టోరీ ఇద్దరు కథానాయికల చుట్టూ తిరగడం. ఇలాంటి స్క్రిప్ట్‌లు చాలా అరుదుగా వస్తాయి. అందుకే 'ఆల్ఫా' జర్నీలో భాగం కావడం సంతోషాన్నిచ్చింది. వేడుకకు ఓ చిరునామాలా ఈ సినిమా నిలుస్తుంది" అని ఆలియా భట్ పేర్కొన్నారు. ఆలియా భట్, శార్వరి లీడ్ రోల్స్‌లో యశ్ రాజ్ ఫిలింస్ నిర్మించిన చిత్రం 'ఆల్ఫా'. ఈ సంస్థ నుంచి స్పై సినిమాలు చాలా వచ్చాయి. కానీ అవి హీరో ఓరియంటెడ్ సినిమాలు. ఈ సంస్థలో స్పై యూనివర్స్‌లో రూపొందిన తొలి మహిళా ప్రధాన చిత్రం 'ఆల్ఫా'. ఈ సినిమాలో పవర్‌ఫుల్ స్పై ఏజెంట్లుగా నటించారు ఆలియా, శార్వరి. శివ్ రావైల్ దర్శకత్వం వహించిన ఈ చిత్రం జూలై 3న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా ఆలియా భట్ మాట్లాడుతూ-- "ఇప్పటివరకూ నేను చేసిన సినిమాల్లో చాలా ఎంజాయ్ చేస్తూ షూటింగ్ చేసినవాటిలో 'ఆల్ఫా' ఒకటి. ప్రతి రోజూ చాలా ఆసక్తిగా షూటింగ్‌కి వెళ్లేదాన్ని. యాక్షన్ నేపథ్యంలో సాగే 'ఆల్ఫా' నాకు సరికొత్త అనుభూతినిచ్చింది" అని చెప్పారు.



# ఓ ఉపాధ్యాయుడి కథ 'సూపర్ సుబ్బు'

సందీప్‌కిషన్, మిథిలా పాల్కర్ జంటగా నటిస్తున్న కామెడీ వెబ్‌సిరీస్ 'సూపర్ సుబ్బు' ట్రైలర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సిరీస్ జూలై 2 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. ఇందులో సందీప్‌కిషన్ సుబ్రహ్మణ్యం అలియాస్ సుబ్బు అనే ఉపాధ్యాయుడి పాత్రలో కనిపించనున్నారు. మాకిపూర్ అనే గ్రామానికి టీచర్‌గా వెళ్లిన అతనికి అక్కడ ఎదురైన పరిస్థితులు, జీవితాన్ని మార్చే సంఘటనల నేపథ్యంలో ట్రైలర్ ఆసక్తికరంగా సాగింది. ఈ సిరీస్‌లో సాధారణ ప్రజలు మాట్లాడటానికి సంకోచించే ఓ సీరియస్ అంశాన్ని హాస్యం, భావోద్వేగాలు మేళవించి చెప్పే ప్రయత్నం చేశామని, సమస్యను పరిష్కరించాలనుకొని తానే ఇబ్బందుల్లో చిక్కుకునే ఉపాధ్యాయుడిగా తన పాత్ర ఆద్యంతం వినోదభరితంగా సాగుతుందని సందీప్‌కిషన్ తెలిపారు. హాస్యంతో పాటు మానవ సంబంధాల ఆవశ్యకతను చర్చించే సినిమా ఇదని కథానాయిక మిథిలా పాల్కర్ పేర్కొన్నది. ఈ సిరీస్‌లో బ్రహ్మానందం, గెటప్ శ్రీను, మానస చౌదరి తదితరులు కీలక పాత్రల్ని పోషించారు. మల్లిక్‌రామ్ దర్శకత్వం వహించారు.వీశీజఅవం

# దక్షిణాదిలో ఆ స్వేచ్ఛ లేదు!

దక్షిణాది సినీరంగంపై అగ్ర కథానాయిక తమన్నా చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. దక్షిణాది సినిమాల్లో పురుషాధిక్యత ఎక్కువగా కనిపిస్తుందని, కథానాయికల్ని గ్లామరస్‌గా చూపించడానికే అధిక ప్రాధాన్యతనిస్తారని తమన్నా వ్యాఖ్యానించింది. 'హిందీ చిత్రసీమలో రెండు రకాల నటులుంటారు. కొందరు అభినయప్రధాన పాత్రల్ని ఎంచుకొని కెరీర్‌ను తీర్చిదిద్దుకుంటారు. మరికొందరేమో కేవలం గ్లామర్‌కే పరిమితమవుతారు. బాలీవుడ్‌లో ఈ రెండింటిలో ఏదో ఒకటి ఎంచుకునే స్వేచ్ఛ ఉంది. కానీ దక్షిణాదిలో మాత్రం నటన, గ్లామర్‌ను బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది' అని తమన్నా పేర్కొన్నది. ఆమె మాటలపై దక్షిణాది అభిమానుల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. తెలుగు, తమిళం ద్వారానే స్టార్‌డమ్‌ను సంపాదించుకొని విశ్వాసం లేకుండా ఇలాంటి మాటలు మాట్లాడటం తగదని నెటిజన్లు సోషల్‌మీడియా వేదికగా కామెంట్స్ చేస్తున్నారు.





# వరుస సినిమాలతో ప్రభాస్ బిజీ

ఇండియన్ సినిమా బిగ్గెస్ట్ సూపర్ స్టార్‌గా గుర్తింపు పొందిన ప్రభాస్ ప్రస్తుతం వరుస పాన్ ఇండియా ప్రాజెక్ట్‌లతో బిజీగా ఉన్నాడు. 'బాహుబలి' తర్వాత ఆయన క్రేజ్ ప్రపంచవ్యాప్తంగా విస్తరించగా, ప్రతి సినిమా మీద అభిమానుల్లో భారీ అంచనాలు నెలకొంటున్నాయి. అయితే ఈ ఏడాది విడుదలైన 'రాజా సాబ్' సినిమా మాత్రం అభిమానులు ఆశించిన స్థాయిలో మెప్పించలేకపోయింది. భారీ అంచనాల మధ్య వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద నిరాశపరిచింది. ఇదిలా ఉంటే, దర్శకుడు హను రాఘవపూడి దర్శకత్వంలో ప్రభాస్ నటిస్తున్న పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'ఫౌజీ'పై కూడా భారీ అంచనాలు ఉన్నాయి. మొదట ఈ చిత్రాన్ని 2026 చివర్లో విడుదల చేయాలని భావించినప్పటికీ, ప్రస్తుతం ఈ సినిమా విడుదల వాయిదా పడే అవకాశాలు కనిపిస్తున్నాయి. తాజా సినీ వర్గాల సమాచారం ప్రకారం 'ఫౌజీ' 2027లో విడుదలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని టాక్ వినిపిస్తోంది. అయితే ఇదే ఇప్పుడు ప్రభాస్ అభిమానులకు మరింత ఆనందాన్ని కలిగిస్తోంది. ఎందుకంటే 2027లో ప్రభాస్ నుంచి ఏకంగా మూడు భారీ ప్రాజెక్టులు ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. అందులో మొదటిగా దర్శకుడు సందీప్ రెడ్డి వంగా తెరకెక్కించనున్న 'స్పిరిట్' ఉంది. ఈ చిత్రంలో ప్రభాస్ పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నాడనే ప్రచారం ఇప్పటికే అభిమానుల్లో ఆసక్తిని పెంచింది. మరోవైపు 'బాహుబలి' ప్రపంచాన్ని మరోసారి తెరపైకి తీసుకొచ్చే యానిమేషన్ చిత్రం 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' కూడా 2027లో విడుదల కానున్నట్లు తెలుస్తోంది. 'బాహుబలి' ఫ్రాంచైజీకి ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ ప్రాజెక్ట్‌పై కూడా భారీ అంచనాలు నెలకొన్నాయి. అదే సమయంలో 'ఫౌజీ' కూడా అదే ఏడాదిలో విడుదలైతే, ప్రభాస్ అభిమానులకు ఒకే ఏడాదిలో మూడు భారీ ట్రీట్స్ లభించినట్లవుతుంది. దీంతో 2027ను ఇప్పటికే అభిమానులు 'ప్రభాస్ నామ సంవత్సరం'గా అభివర్ణిస్తున్నారు. భిన్నమైన కథలు, భారీ స్థాయి నిర్మాణ విలువలు, పాన్ ఇండియా మార్కెట్‌లో ప్రభాస్‌కు ఉన్న క్రేజ్ దృష్ట్యా ఈ చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా 'స్పిరిట్', 'ఫౌజీ', 'బాహుబలి: ది ఎటర్నల్ వార్' చిత్రాలు ఒకే ఏడాదిలో విడుదలైతే భారతీయ సినీ పరిశ్రమలోనే అరుదైన రికార్డులు నమోదయ్యే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఇప్పుడు అభిమానుల దృష్టి మొత్తం ఈ ప్రాజెక్ట్‌ల అధికారిక విడుదల తేదీలపైనే ఉంది.

# ఆదర్శకుటుంబం ఆలస్యం అవుతోందా?




విక్టరీ వెంకటేష్, మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబినేషన్‌లో ఎంతో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న క్రేజీ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ 'ఆదర్శ కుటుంబం హౌస్ నెం. 47. సితార ఎంటర్‌టైన్మెంట్స్ నిర్మిస్తున్న ఈ సినిమాను అక్టోబర్ 2న గాంధీ జయంతి సందర్భంగా విడుదల చేయబోతున్నట్లు ఇటీవల వార్తలు వినిపించాయి. కానీ పరిస్థితులు చూస్తుంటే అందుకు అనుగుణంగా లేవు అనే టాక్ వినిపిస్తోంది. ఫిల్మ్ నగర్ వర్గాల్లో ఈ సినిమా విడుదలపై ఒక షాకింగ్ గాసిప్ గట్టిగా వినిపిస్తోంది. ఈ మోస్ట్ అవేటెడ్ మూవీ అనుకున్న సమయానికి రావడం లేదని వాయిదా పడే అవకాశాలు చాలా ఎక్కువగా ఉన్నాయని టాక్ నడుస్తోంది. ఈ సినిమా షూటింగ్ లో కొన్ని అవాంతరాలు ఎదురయ్యాయని, కొన్ని సీన్స్ రీ షూట్ చేస్తున్నారని అక్టోబర్ 2లు షూటింగ్ ఫినిష్ అయ్యే అవకాశం లేదని టాక్. ఒకవేళ ఈ అక్టోబర్ లాంగ్ వీకెండ్ డేట్‌ను గనుక మేకర్స్ మిస్ చేసుకుంటే.. ఆ తర్వాత ఈ ఏడాదిలో సరైన విండో దొరకడం కష్టమేనని ఇండస్ట్రీ విశ్లేషకులు భావిస్తున్నారు. అదే జరిగితే, 'ఎకె 47' చిత్రాన్ని ఏకంగా 2027 సమ్మర్ సీజన్‌కు మాత్రమే పోస్ట్‌పోన్ చేసే అవకాశాలు ఉన్నట్లు గట్టిగా ప్రచారం సాగుతోంది. అయితే ఈ గాసిప్స్ పై ప్రొడక్షన్ హౌస్ నుండి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు అలాగే ఖండించలేదు. దీంతో వెంకీ ఫ్యాన్స్ కాస్త కంగారు పడుతున్నారు. మరి ఈ క్రేజీ ప్రాజెక్ట్ అనుకున్న సమయానికే వస్తుందా లేదా లాంగ్ డిలే అవుతుందా అనేది తెలియాలంటే మేకర్స్ క్లారిటీ ఇచ్చే వరకు వేచి చూడాల్సిందే.

# సెప్టెంబర్‌లో రానున్న సర్దార్-2



నీళ్ల మాఫియా గురించి చర్చిస్తూ సందేశాత్మక కథాంశంతో గూఢచారి థ్రిల్లర్‌గా రూపొందిన 'సర్దార్' చిత్రం ప్రేక్షకుల ప్రశంసలు అందుకోవడంతో పాటు బాక్సాఫీస్ వద్ద కూడా భారీ విజయాన్ని సాధించింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా తెరకెక్కిన 'సర్దార్-2' సెప్టెంబర్ 10న ప్రేక్షకుల ముందుకురానుంది. కార్తి కథానాయకుడిగా పీఎస్ మిత్రన్ దర్శకత్వంలో ఈ చిత్రాన్ని రూపొందించారు. బుధవారం రిలీజ్ డేట్‌ను ప్రకటిస్తూ చిత్రబృందం కొత్త పోస్టర్‌ను పంచుకుంది. ఈ సీక్వెల్‌లో అంతర్జాతీయ డ్రగ్స్ స్మగ్లింగ్ గురించి చర్చించబోతున్నట్లు తెలిసింది. గూఢచారి వ్యవస్థ చుట్టూ అల్లుకున్న ఈ కథలో దేశభక్తి, సామాజిక సందేశం ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. మాళవిక మోహనన్, ఎస్‌జే సూర్య, ఆషికా రంగనాథ్, యోగిబాబు, రజిషా విజయన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: సామ్ సీఎస్, నిర్మాతలు: ఎస్.లక్ష్మణ్ కుమార్, ఇషాన్ సక్సేనా, దర్శకత్వం: పీఎస్ మిత్రన్.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.